epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

MEDIA

మెయిన్ : గురువారం - అక్టోబర్ 12-2023 పేజీలు : 3

## ఐదురోజుల భీకర యుద్ధం

### -3,500 మందికిపైగా మృతి



**టీ మీడియా, అక్టోబర్ 11, గాజా :** ఇజ్రాయెల్ పాలస్తీనాల మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. శనివారం నుంచి మొదలైన ఈ యుద్ధం వల్ల ఐదురోజుల్లో వేలాది మంది మృతి చెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన దాడిగా గాజా అధికారులు తెలిపారు. ఈ యుద్ధం వల్ల ఇజ్రాయెల్‌లో దాదాపు 1,200 మందికి పైగా మృతి చెందారు. అలాగే గాజా స్ట్రిప్‌లో 900 మందికిపైగా మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ భీకర పోరులో పాలస్తీనా హమాస్ గ్రూపుకు చెందిన 1,500 మంది మిలిటెంట్ల మృతదేహాలను గుర్తించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. పాలస్తీనా, ఇజ్రాయెల్ ఇరువైపులా దాదాపు మొత్తం 3,600 మందికిపైగా మృతి చెందారని అధికారులు వెల్లడించారు. గాజాలోని హమాస్ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ రాత్రిపూట జరిపిన దాడుల్లో కనీసం 30 మంది మృతి చెందారు. సైనిక విమానాలను గుర్తించేందుకు హమాస్ ఉపయోగించే అధునాతన ఫైటర్ జెట్ విమానాలను ఇజ్రాయెల్ సైన్యం నాశనం చేసింది.

## ప్రపంచ ఆర్థికాభివృద్ధికి, ఆవిష్కరణలకు కేంద్రంగా భారత్

### - ప్రధాని మోడి



**టీ మీడియా, అక్టోబర్ 11, న్యూఢిల్లీ :** దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్ మెరుగైన స్థానానికి చేరుకుంటోందని ప్రధాని మోడి అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' పేరుతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ దేశాల వృద్ధి రేటు అంచనాలను విడుదల చేసింది. భారత్ వృద్ధి రేటు అంచనా 6.3 శాతంగా ఉంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ పేర్కొంది. ఇటీవల భారత్ వృద్ధి రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.5 శాతంగా పేర్కొంది. దానికి 0.2 శాతం తగ్గించి 6.3గా ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత జులైలో భారత్ వఅద్ధి రేటును 6.1 శాతంగా ఐఎంఎఫ్ పేర్కొనడం గమనార్హం. ఈసారి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా వృద్ధి రేటు భారత్ కంటే తక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆ దేశంలో నెలకొన్న స్థిరాస్తి విపణి సంక్షోభం కారణంగా వృద్ధి రేటు అంచనాలను తగ్గించినట్లు ఐఎంఎఫ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ అంచనాలను ఉద్దేశించి ప్రధాని మోడి ట్వీట్ చేశారు. " దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధికి, ఆవిష్కరణలకు భారత్ కేంద్రంగా నిలుస్తోంది. సుసంపన్నమైన భారత్‌ను సాధించే దిశగా మన ప్రయాణాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం. మన సంస్కరణలను మరింత పెంచుదాం " అని ప్రధాని పేర్కొన్నారు.

### ఐదు రాష్ట్రాలఎన్నికల్లో...

# ఎస్సీ, ఎస్టీలే కీలకం

- -తెలంగాణలో ఎస్సీ-ఎస్టీ
- -ఛత్తీస్‌గఢ్‌లో ఎస్సీ-ఎస్టీ సీట్లు..
- -మిజోరాంలోనూ అదే పరిస్థితి
- -రాజస్థాన్‌లో 59 రిజర్వ్ స్థానాలు




**టీ మీడియా, అక్టోబర్ 11,ఢిల్లీ :** జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల గెలుపోటములను శాసిస్తూ ప్రభుత్వాలను నిర్ణయించే అంశాలు చాలానే ఉంటాయి. ఓటర్లను ఆకట్టుకునే హామీలు, మేనిఫెస్టోతో పాటు సిట్టింగ్ ప్రభుత్వాలపై ఉండే సానుకూలత లేదా వ్యతిరేకత సహా ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. వాటిలో కులాలు, మతాలు, వర్గాల పేరుతో ఓటుబ్యాంకుగా ఏర్పడే సమూహాలు కూడా కీలకమే. గతంలో జరిగిన ఎన్నికల సరళిని విశ్లేషిస్తే.. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో కీలకంగా మారారని అర్థమవుతోంది. అందుకే ఈ వర్గాల ఓట్ల కోసం భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్‌తో పాటు ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు సైతం ఈ దళిత, గిరిజనుల ఓట్ల వేటలో పరుగులు తీస్తున్నాయి. 2018లో దళిత, గిరిజనుల విశ్వాసాన్ని పొందలేకపోవడం వల్లనే బీజేపీ మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ మూడు రాష్ట్రాలతో పాటు తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఐదు రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) కు చెందిన ఓటర్లు అధికార పీఠాన్ని అప్పగించడంలో కీలకంగా మారనున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాల్లో మొత్తం 669 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి, వీటిలో 250 సీట్లు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసి ఉన్నాయి. అంటే మొత్తం సీట్లలో వీరి వారా 37.36 శాతం. ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మూడింట రెండొంతుల ఎస్సీ-ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో విజయ పతాకాన్ని ఎగురవేసి అధికారాన్ని నిలబెట్టుకోవాలన్న బీజేపీ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లింది. అదే విధంగా తెలంగాణలో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్), మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) దళిత, గిరిజన సీట్లలో మెజారిటీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మాయాజాలం ఈ రిజర్వుడు స్థానాల్లో దాగి ఉండడానికి ఇంతకంటే ప్రత్యక్ష ఉదాహరణ మరొకటి లేదు.

### తెలంగాణలో ఎస్సీ-ఎస్టీ రాజకీయాలు..

దళిత, గిరిజన ఓటర్ల మనసు గెలవకుండా తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం. ఎందుకంటే 18 శాతం ఎస్సీ, 12 శాతం ఎస్టీ ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. రాష్ట్రంలోని ఓటర్లలో దాదాపు 30 శాతం మంది ఈ రెండు వర్గాలకు చెందినవారే. ఈ కారణంగా తెలంగాణలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో 31 సీట్లు రిజర్వ్ స్థానాలుగా ఉన్నాయి. వాటిలో 12 సీట్లు ఎస్టీకి, 19 సీట్లు ఎస్సీకి రిజర్వ్ అయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక రిజర్వ్‌డ్ స్థానాలను కైవసం చేసుకోవడంలో కేసీఆర్ పార్టీ విజయం సాధించింది. దళిత ముఖ్యమంత్రి, దళితులకు 3 ఎకరాల వ్యవసాయ భూమి, దళిత బంధు వంటి పథకాలను కేసీఆర్ తీసుకొచ్చి వారిని ఎప్పుడూ తమవైపే ఉండేలా చూసుకుంటున్నారు. గిరిజనుల కోసం కోసం కొన్ని పథకాలను ప్రకటించారు. అయితే పథకాలు ప్రకటించిన స్థాయిలో అమలుకావడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పరిస్థితుల్లో దళిత, గిరిజనులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా అనేకరకాలుగా ప్రయత్నాలు చేస్తోంది.

### మిజోరాంలోనూ అదే పరిస్థితి..

అదే సమయంలో మిజోరం రాజకీయాలు గిరిజన సంఘాల చేతుల్లో ఉన్నాయి. ఎందుకంటే ఈ రాష్ట్రం మొత్తం ఎత్తైన పర్వతాల మధ్య కొలువై ఉంది. రాష్ట్రంలోని మొత్తం 40 సీట్లలో 39 సీట్లు ఎస్టీ కమ్యూనిటీకి, ఒక సీటు జనరల్ కేటగిరీకి రిజర్వ్ అయింది. మిజోరాంలో ఎస్సీ వర్గానికి ఒక్క సీటు కూడా లేదు. 2018 ఎన్నికలలో మిజో నేషనల్ ఫ్రంట్ ప్రజలను ఆకట్టుకోగల్గింది. కానీ కానీ ఈసారి సవాళ్లను ఎదుర్కొంటోంది.

## సచిన్ రికార్డు బద్దలు కొట్టిన రోహిత్..

### -భారత్ కు భారీ విజయం



**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్ :** ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో భారత్ రెండో మ్యాచ్ లోనూ ఘన విజయం సాధించింది. అఫ్ఘనిస్తాన్ తో జరిగిన మ్యాచ్ భారత్ 8 వికెట్ల తో తేడాతో భారీ విజయం నమోదు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్ఘనిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లకు 272 పరుగులు చేయగా 273 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 35 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేదించింది. భారత బ్యాట్స్ మెన్లలో ఓపెనర్ రోహిత్ శర్మ (131) విధ్వంసం సృష్టించి అద్భుత సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషాన్ (47) అర్థసెంచరీ మిస్ చేసుకున్నాడు. ఇక కింగ్ కోహ్లీ (55) నాటౌట్ గా నిలిచి అర్ధ సెంచరీ పూర్తి చేసి భారత్ కు విజయం అందించారు. భారత సారథి రోహిత్ శర్మ అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. అఫ్ఘనిస్తాన్ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడిన రోహిత్.. కేవలం 63 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్ తరఫున వన్డే ప్రపంచకప్‌లో ఇదే అత్యంత వేగవంతమైన శతకం కాగా.. ఓవరాల్‌గా మెగాటోర్నీలో రోహిత్‌కు ఇది ఏడో సెంచరీ. తద్వారా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు. 24 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో సచిన్ 6 ప్రపంచకప్‌లు ఆడి.. ఆరు శతకాలు తన పేరిట లిఖించుకోగా.. రోహిత్ కేవలం 19 ఇన్నింగ్స్‌ల్లోనే ఆ రికార్డు బద్దలు కొట్టి అగ్రస్థానానికి చేరాడు.

## రెండో రోజు ముగిసిన లోకేశ్ సీఐడీ విచారణ



**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్ :** ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెండో రోజు సీఐడీ విచారణ ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 6గంటల పాటు లోకేశ్‌ను సీఐడీ అధికారులు విచారించారు. విచారణ ముగిసిన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. "ఏపీ హైకోర్టు ఒక్క రోజే విచారణకు హాజరు కావాలని చెప్పినా.. సీఐడీ అధికారుల సూచనమేరకు రెండో రోజు కూడా విచారణకు హాజరయ్యా. రెండో రోజు 47 ప్రశ్నలు అడిగారు. అవి కూడా నిన్న అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగారు. వాషింగ్ మెషీన్‌లో వేసి తిప్పినట్టుగా మంగళవారం అడిగిన ప్రశ్నలే తిప్పి.. తిప్పి అడిగారు. భువనేశ్వరి ఐటీ రిటర్న్స్ డాక్యుమెంట్ నా ముందు పెట్టి ప్రశ్నించారు. భువనేశ్వరి ఐటీ రిటర్న్స్ మీ వద్దకు ఎలా వచ్చిందని దర్యాప్తు అధికారిని అడిగితే సమాధానం చెప్పలేదు. దీనిపై న్యాయ పరంగా పోరాటం చేయాలనుకుంటున్నా. ఇన్నర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి కేవలం నాలుగైదు ప్రశ్నలు మాత్రమే అడిగారు. నా శాఖకు సంబంధం లేని ప్రశ్నలు పదే పదే అడిగారు. ఈ కేసులో మరోసారి లేఖ ఇస్తారా? అని దర్యాప్తు అధికారిని అడిగితే సమాధానం చెప్పలేదు" అని లోకేశ్ వివరించారు.

## మీ సర్కారుకు తల్లిదండ్రుల శాపం

### -టి పి సి సిప్రెసిడెంట్రేవంత్ రెడ్డి





**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్ :** తెలంగాణలో ఎన్నికల తేదీని ఈసీ ప్రకటించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరూ విమర్శలు చేసుకుంటున్నారు. ఇవాళ మంత్రి కేటీఆర్ రేవంత్ రెడ్డిపై ట్వీట్ చేశాడు. "ప్రత్యర్థి పక్షాన్ని ఎదుర్కొనే దమ్ములేక, ఇలాంటి నీచమైన మాటలు మాట్లాడే నువ్వు ప్రతిపక్ష నాయకుడివి కాదు.. రాజకీయ నాయకుడివి కాదు.. అసలు మనిషివే కాదు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం, కించపరచడం నీ నీచ ప్రవృత్తికి ఉదాహరణ. నీలాంటి వాడు తెలంగాణలో పుట్టడం మొత్తం తెలంగాణకే అవమానం. ఉదాత్తమైన సంస్కారం..ఆప్యాయత, అనురాగం నీలాంటి మరుగుజ్జులకు ఏం అర్థమవుతాయిలే".. అని పేర్కొన్నాడు. ఇందుకు రేవంత్ రెడ్డి కూడా కౌంటర్ వేశాడు. దూరంగా ఉన్న బిడ్డ గుర్తుకొచ్చి గుండె బరువెక్కుతోందా కేటీఆర్.. కొడుకుతో కొద్ది రోజుల ఎడబాటుకే ప్రాణం తల్లడిల్లిపోతోంది కదా.. ఉద్యోగం కోసం ఏండ్ల తరబడి ఇంటి మొఖం చూడని, లక్షలాది మంది నిరుద్యోగుల తల్లిదండ్రుల ఆవేదన నీలా కాదనుకున్నావా? సర్కారు హాస్టళ్లలో మీరు పెట్టే తిండి తినలేక ఏడుస్తున్నారని తెలిసి అమ్మా నాన్నలు పడే ఆవేదన నీలా కాదనుకున్నావా? కొడుకు తిరిగిరాక, పదేళ్లుగా ఏ సాయానికి నోచుకోక కుమిలి కుమిలి ఏడుస్తున్న అమరవీరుడి కుటుంబ యాతన నీలా కాదనుకున్నావా? మీ గ్లోబరీనా కంపెనీ ఉసురు తీసిన 30 మంది ఇంటర్ విద్యార్థుల కన్నపేగుల ఆక్రందన.. నీలా కాదనుకున్నావా? తిండిపెట్టక చిన్నారులని ఏడిపించి, ఫీజు బకాయిలివ్వక యువతని గోసపెట్టి, ఉద్యోగాలివ్వక నిరుద్యోగులని వంచించిన మీ సర్కారుకు తల్లిదండ్రుల శాపం తగిలి తీరుతుంది.. అని కౌంటర్ వేశాడు రేవంత్ రెడ్డి.

## కలెక్టర్లు, ఎస్పీలపై ఈసీ బదిలీ వేటు

**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్:** రాష్ట్రంలో పలువురు కలెక్టర్లు, ఎస్పీలపై ఈసీ బదిలీ వేటు వేసింది. రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు, 13 మంది ఎస్పీలు, పోలీసు కమిషనర్లను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్, వరంగల్, నిజామబాద్ పోలీసు కమిషనర్లు, రవాణాశాఖ కార్యదర్శి, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ఈసీ జారీ చేసిన జాబితాలో ఉన్నారు. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖకు ప్రత్యేక కార్యదర్శులను నియమించాలని ఈసీ ఆదేశాల్లో పేర్కొంది. గురువారం సాయంత్రం 5గంటల కల్లా ప్యానల్ పంపాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

### విప్లవాత్మక నిర్ణయాలతో..

# రైతులకు మేలు చేస్తున్నాం

## వ్యవసాయం, పౌరసరఫరాలశాఖలపై సీఎంజగన్ సమీక్ష



**టీ మీడియా, అక్టోబర్ 11,తాడేపల్లి :**ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా, మద్ధతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సీఎం ఆదేశించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్దతు ధర ఇవ్వడంతో పాటు, జీఎల్టీ రూపంలో క్వింటాలుకు సుమారు రూ.250లపైనే అదనంగా రైతులకు లభిస్తోందన్నారు. ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలతో రైతులకు మేలు చేస్తున్నామని సీఎం జగనన్న పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు మేలు జరిగేలా చూడాలని ఆదేశించారు. బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు పౌరసరఫరాలశాఖలపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికే 85శాతం ఇ-క్రాప్ పూర్తిచేశామని వెల్లడించిన అధికారులు.అక్టోబరు 15లోగా నూరుశాతం ఇక్రాపింగ్ పూర్తిచేస్తామని వెల్లడి ఈ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సమాయత్తమవుతున్నామన్న అధికారులు.ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే... ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా, మద్ధతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్ధతు ధర ఇవ్వడంతో పాటు, జీఎల్టీ రూపంలో క్వింటాలుకు సుమారు రూ.250లపైనే అదనంగా రైతులకు లభిస్తోంది ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలతో రైతులకు మేలు చేస్తున్నామన్నధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు మేలు జరిగేలా చూడాలన్న సీఎం.ఎప్పటిలానే మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయాన్ని పూర్తిగా నివారించాలని సీఎం ఆదేశం. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు మిల్లర్లను ఆశ్రయించాల్సిన అవసరం రాకూడదన్న సీఎం ధాన్యంతోపాటు చిరుధాన్యాలనూ కొనుగోలు చేస్తున్నామన్న అధికారులు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు మిల్లెట్స్ సాగుచేస్తున్న రైతులకు తోడుగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు.ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏర్పాటు చేస్తున్న యూనిట్లను ఉపయోగించుకుని ఈ మిల్లెట్స్‌ను ప్రాసెస్ చేయాలన్నీఏటా రైతులనుంచి తృణధాన్యాలు కొనుగోలు పెరిగే అవకాశాలున్నందున ఆ మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాల, మిల్లెట్లను ప్రజలకు పంపిణీ చేయాలన్న సీఎం. మిల్లెట్ల వినియోగం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై కరపత్రాలతో అవగాహన కల్పించాల, ఏడాది రెండో విడత రైతు భరోసాకు సిద్ధం కావాలని అధికారులకు సీఎం ఆదేశాలు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఇప్పటివరకూ రూ.31,005.04 కోట్లు అందించిన శ్రీ వైయస్.జగన్ ప్రభుత్వం. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిలో డిఆర్‌ఓజీఓ%--% ఆర్‌టీపీఓ కేంద్రాల్లో ఔత్సాహికులైన వారికి కిసాన్ డ్రోన్లపై శిక్షణ.

- **ఇప్పటివరకూ 422 మందికి శిక్షణ అందించినట్లు తెలిపిన అధికారులు.**
- **నవంబర్ మూడోవారం నాటికి నాటికి మండలానికి ఒకరికి చొప్పున శిక్షణ పూర్తవుతుందన్న అధికారులు.**

వీరిద్వారా మిగతా వారికి శిక్షణ ఇప్పించే కార్యక్రమాలు చేపడతామన్న అధికారులు. ఆర్బీకేల స్థాయిలో భూసార పరీక్షలు చేసే విధంగా అధికారులు అడుగులు ముందుకేయాల,దీనికి అవసరమైన పరికరాలు ఆర్బీకేల్లో ఉంచేలా చూడాల,దీనికోసం అవసరమైన ప్రణాళిక సిద్ధంచేయాల పంట వేసే ముందు భూసార పరీక్షలు జరగాలని, ఆమేరకు సర్టిఫికెట్ ఇచ్చేలా ఉండాలన్న సీఎం వేయాలి? ఏయే రకాల ఎరువులు ఎంత మోతాదులో వేయాలన్న దానిపై రైతులకు పూర్తి వివరాలు అందించేలా ఉండాల దీనివల్ల అవసరమైనంతమేరకే ఎరువులను వినియోగిస్తారని, రైతులకు కూడా ఖర్చులు కలిసి వస్తాయన్న సీఎం.

-చేయూత కింద మహిళలకోసం స్వయం ఉపాధి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగాలన్న సీఎం.

- సుస్థిర జీవనోపాధి మార్గాలు ఏర్పాటుకావాలని, దీనిపై నిరంతరం సమీక్ష జరగాలన్న సీఎం.

- చేయూతకింద ఇస్తున్న డబ్బుకు అదనంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం ద్వారా పాడి సహా ఇతర స్వయం ఉపాధి మార్గాలు ఏర్పాటు చేయాలన్న సీఎం. అవి విజయవంతంగా నడిచేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్న సీఎం. అమూల్ కార్యక్రమం ద్వారా ఇప్పటికే చాలామంది లబ్ధి పొందుతున్నారన్న అధికారులు, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల, వ్యవసాయమే కాకుండా అనుబంధ రంగాల్లో మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు బలోపేతంగా నడవాల, పశుగ్రాసం, దాణా కొరతలేకుండా చూసుకోవాల, ప్రతి ఆర్బీకేని యూనిట్‌గా తీసుకుని టీఎమ్మార్ ఇచ్చేలా చూడాల

# డిండి నీళ్లు తీసుకొచ్చి..

## దేవరకొండ ప్రజల రుణం తీర్చుకుంటాం: మంత్రి

**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్** : దేవరకొండ నియోజకవర్గ ప్రజల దశాబ్ద కల అయినటువంటి.. డిండి నీళ్లు తీసుకొచ్చి ఈ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో మంత్రి జగదీశ్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్.. బిల్యా నాయక్, ఆయన అనుచరులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు.ఒక్క దేవరకొండ నియోజకవర్గంలో ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ. 600 కోట్లతో నిర్మిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. రాబోయే సంవత్సర కాలంలో ఈ పనులు పూర్తవుతాయి. డిండి ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదు. రాబోయే సంవత్సర కాలంలోనే డిండి నీళ్లు తీసుకొచ్చి దేవరొకండ ప్రజల రుణం తీర్చుకుంటాం. అది మాత్రమే కాదు.. గిరిజన తండాల్లో మిషన్ భగీరథ నీళ్లు ఇస్తున్నాం. రైతుబీమా, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు.






దేవరకొండ నియోజకవర్గంలో కొత్తగా మూడు మండలాలు చేసుకున్నాం అని కేటీఆర్ తెలిపారు. దేవరకొండ నగరపంచాయతీని మున్సిపాలిటీ చేసుకున్నాం. రోడ్ల నిర్మాణానికి రూ. 35 కోట్లు మంజూరు చేశాం. ఇన్ని పనులు మన కండ్ల ముందు కనబడుతుంటే.. సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంటే.. ఇవాళ కాంగ్రెసోళ్లకు ఏం చేయాలో తెలియడం లేదు. ప్రతిపక్షాలకు పని లేకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.ఈ దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ఇవాళ వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు అడుగుతున్నారు. మన వేలితో మన కంటిని పొడుచుకుందామా? ఆలోచించండి. నాడు కరెంట్ లేక రైతులు విలవిలలాడిపోయారు. విద్యుత్ వెలుగులతో ఇవాళ రాష్ట్రం వెలిగిపోతోంది. కరెంట్ కష్టాలు వద్దనుకుంటే కేసీఆర్‌కు ఓటేయండి. కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నారు. బీజేపోళ్లేమో రోజుకు ఒకరు వచ్చి ఏదో మాట్లాడి పోతారు. ట్రైబల్ యూనివర్సిటీ పెట్టేందుకు జాగా ఇవ్వలేదని ఒక పెద్దాయన మాట్లాడుతున్నారు. ట్రైబల్ యూనివర్సిటీ కోసం ఐదేండ్ల క్రితం 360 ఎకరాలు ఇచ్చాం. ఇప్పుడు నిద్ర లేచి డైలాగులు కొడుతున్నారు. అమిత్ షా ఆదిలాబాద్ వచ్చి రైతు ఆత్మహత్యల్లో తెలంగాణను టాప్ చేశారని అంటున్నారు. బాధ్యత గల మంత్రివి అయితే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తక్కువగా ఉన్నాయని నీ ప్రభుత్వమే పార్లమెంట్‌లో చెప్పింది. ఇంత సిగ్గుమాలిన అబద్దాలు ఆడుతున్నారు. బీజేపీకి అబద్దాలు చెప్పడం అలవాటై పోయిందన్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలని మనం కోరుతున్నాం. మన నాయకుడే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కోరుకుంటున్నప్పుడు.. వారికి తొత్తులుగా పని చేసే అవసరం మనకు ఏముందని కేటీఆర్ అడిగారు.

## టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టులో ఊరట..

**టీ మీడియా, అక్టోబర్ 11, అమరావతి :** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. అంగళ్లు కేసులో 12వ తేదీ వరకు, ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) కేసులోనూ 16వ తేదీ వరకు అరెస్టు చేయొద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రెండు కేసుల్లోనూ ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ రెండు కేసుల్లోనూ బాబును అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును ఆయన తరపు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. ఈ కేసుల్లో విచారణకు సహకరిస్తామని కోర్టుకు తెలిపారు. ఈ విషయంపై సీఐడీ, హోంశాఖతో మాట్లాడి చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదులకు కోర్టు సూచించింది. ఏసీబీ కోర్టులో పీటీ వారెంట్ పెండింగ్‌లో ఉందని కోర్టుకు అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ తెలిపారు. ఈ దశలో బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రెండు కేసుల్లోనూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



## గాజా ఇకపై మునుపటి స్థితికి వెళ్లడం అసాధ్యం

**- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి**



**టీ మీడియా, అక్టోబర్ 11, న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ఐదో రోజుకు చేరుకుంది. అక్టోబర్ 6న ప్రారంభమైన ఈ యుద్ధంలో హమాస్‌పై ఇజ్రాయెల్ క్రమంగా పైచేయి సాధిస్తోంది. వారి ఆధీనంలో ఉన్న ప్రాంతాలను తిరిగి తమ ఆధీనంలోకి తీసుకుంటోంది. ఈ క్రమంలో తమ దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేస్తోంది. ముఖ్యంగా గాజాపై వరుస దాడులతో విరుచుకుపడుతోంది. గాజా (%+ఘఝ%)లోని హమాస్ మిలిటెంట్ల ప్రధాన స్థావరాలపై వరుసగా క్షిపణులు, బాంబులతో దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే హమాస్ లక్ష్యాలపై పూర్తి స్థాయిలో దాడులు చేయనున్నట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ తాజాగా ప్రకటించారు. 'గాజా సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించాం. అంతిమంగా హమాస్‌ను ఇజ్రాయెల్ ఏరిపారేస్తుంది. హమాస్ సీనియర్ సభ్యులను అంతమొందించడమే మా లక్ష్యం. మిలిటెంట్ల నియంత్రణలోని గాజా సరిహద్దు ప్రాంతాలను మా ఆధీనంలోకి తీసుకున్నాం. గాజా ఇకపై మునుపటి స్థితిలోకి వెళ్లడం అసాధ్యం. ఇందుకు హమాస్ విచారించడం ఖాయం. గాజాలో హమాస్ మార్పును కోరుకుంటోంది. అది అనుకున్న స్థితి నుంచి 180 డిగ్రీలు మారుతుంది' అని ఆయన అన్నారు.

## ఏపీ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులు

**- సిఫారసు చేసిన కొలీజియం**

**టీ మీడియా, అక్టోబర్ 11, న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు రాబోతున్నారు. ఈ మేరకు వారి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ జే.సుమతి, జస్టిస్ ఎస్. విజయన్ పేర్లతో కూడిన జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. దీనికి కేంద్ర న్యాయశాఖ ఆమోదం లభించాల్సి ఉంది. సీనియర్ అడ్వొకేట్లయిన వీరికి ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించింది. ఈ ప్రతిపాదనలకు సీజేఐ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియం ఆమోదం తెలిపింది. వీరితోపాటు మరో ఇద్దరు జ్యుడీషియల్ అధికారులు శైలేందర్ కౌర్, రవీందర్ దుదేజా ఢిల్లీ హైకోర్టుకు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందారు.




## ఎన్నికల అవగాహనా సదస్సు



**టీ మీడియా, అక్టోబర్ 11, లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట మున్సిపాలిటీ లోని గాంధీనగర్ కాలనీలో ఈ రోజు లక్షెట్టిపేట పట్టణ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరికి సంబంధించిన పార్టీ నాయకులు,కార్యకర్తలు వారి వారి పార్టీల గురించి ఏలాంటి విభేదాలు తలెత్తకుండా ప్రచారం చేసుకోవాలని,ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఏలాంటి అల్లర్లు జరిపిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని కఠిన చర్యలు తీసుకోవటం తప్పదన్నారు.ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిభందనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లోఎస్ ఐ లక్షణ్ , పోలీస్ సిబ్బంది,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పఠాన్‌కోట్ దాడి సూత్రధారి షాహిద్ లతీఫ్ హత్య

**టీ మీడియా, అక్టోబర్ 11, చండీగఢ్ :** భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది షాహిద్ లతీఫ్ పాకిస్తాన్‌లో ముష్కరుల చేతిలో హతమయ్యాడు. 2016 పఠాన్‌కోట్ దాడికి సూత్రధారి అయిన జైషే మహ్మద్ ఉగ్రవాది షాహీద్ లతీఫ్‌ని పాకిస్తాన్‌లో సియాల్‌కోట్‌లోని మసీదులో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపినట్లు నివేదికలు తెలిపాయి. ఈ ఘటనలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఉగ్రవాది లతీఫ్ అలియాస్ బిలాల్, అతని ఇద్దరు సహచరులు కూడా తుపాకీ కాల్పుల్లో మృతి చెందారు. లతీఫ్ 1993లో కాశ్మీర్‌లోకి లోయలోకి చొరబడ్డాడు. ఒక సంవత్సరం తర్వాత అరెస్టయ్యాడు. జైష్ ఇ మహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్‌తో కలిసి 2010 వరకు జమ్మూ జైలులో ఉన్నాడని అధికారులు తెలిపారు. 2010లో యుపిఎ ప్రభుత్వం సత్ప్రవర్తన కారణంగా విడుదల చేసిన 25 మంది ఉగ్రవాదుల్లో లతీఫ్ కూడా ఉన్నారు. కాగా, 2016 జనవరి 2 పఠాన్‌కోట్ వైమానికస్థావరంపై దాడికి లతీఫ్ ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. జైష్ ఇ మహ్మద్ గ్రూపుకు చెందిన నలుగురు ఉగ్రవాదులు పఠాన్‌కోట్ వైమానక స్థావరంలోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అప్పుడు జరిగిన ఈ దాడిలో ఏడుగురు ఐఎఎఫ్ సిబ్బంది మృతి చెందారు.



## ఎయిర్‌పోర్టులో భారీ అగ్నిప్రమాదం

**విమానాల రాకపోకలు నిలిపివేత**



**టీ మీడియా, అక్టోబర్ 11, లండన్:** లండన్‌లోని లూటన్ విమానాశ్రయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం ఉదయం ఎయిర్‌పోర్ట్‌లోని కారు పార్కింగ్ ఏరియాలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర వాహనాలకు కూడా అంటుకోవడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో పార్కింగ్ పైకప్పు పాక్షికంగా కూలిపోయింది. ఈనేపథ్యంలో విమానాల రాకపోకలను నిలిపివేశారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని రకాల విమానాలను నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీస్ సిబ్బంది మంటలను ఆర్పడానికి, విమానాశ్రయంలోని ఇతర భవనాలు, వాహనాలకు మంటలు వ్యాపించకుండా నిరోధించడానికి కృషి చేస్తున్నారని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)వేదికగా తెలిపింది.

## అఫ్ఘానిస్థాన్‌లో మళ్లీ భూకంపం


**టీ మీడియా, అక్టోబర్ 11, కాబూల్:** ఇటీవల వరుస భూకంపాలతో దద్దరిల్లిన అఫ్ఘానిస్థాన్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగానే మరో భూకంపం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున 6.11 గంటలకు 6.1 తీవ్రతతో భూమి కంపించింది. హెరాత్ నగరానికి 29 కిలో మీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. అయితే ఈ భూకంపం వల్ల జరిగిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ఇటీవలే కొన్ని గంటల వ్యవధిలో సంభవించిన వరుస భూకంపాలు అఫ్ఘానిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. భూకంప ప్రాంతాల్లో భారీ భవనాలు కుప్పకూలడంతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. నాలుగు రోజులుగా జరుగుతున్న సహాయక చర్యల్లో ఇప్పటి వరకు 4 వేల మృతదేహాలను వెలికితీశారు. ఇంకా శిథిలాల తొలగింపు కొనసాగుతున్నది. ఇంతలోనే మళ్లీ భూకంపం సంభవించడం అఫ్ఘానిస్థాన్‌ను ఆందోళనకు గురిచేస్తున్నది.



### శరన్నవరాత్రి ఉత్సవాలకు

## ఇంద్రకీలాద్రి సిద్ధం..

**- రోజుకు 1.70 లక్షల మంది దర్శించుకునేలా ఏర్పాట్లు**



**టీ మీడియా, అక్టోబర్ 11, విజయవాడ :** అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ కొలువైఉన్న విజయవాడలోని ఇంద్రకీలాద్రి దసరా శరన్న వరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్నది. ఈ నెల 15 నుంచి 23 వరకు తొమ్మిదిరోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవాల సందర్భంగా రోజుకు లక్షా 70 వేల మంది దుర్గమ్మను దర్శించుకునే ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. పత్రి సెకనుకు ఇద్దరు, ముగ్గురు భక్తులు దర్శించుకోవచ్చని వెల్లడించారు. రోజుకు 4 గంటలు పూజలు, నివేదనలు, 20 గంటలపాటు భక్తుల దర్శనాలు ఉంటాయన్నారు. ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రొటోకాల్ ఉన్నవారు స్వయంగా వస్తేనే అనుమతిస్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ 15న ఇంద్రకీలాద్రిపై దేవీ నవరాత్రులు ప్రారంభమవుతాయి. 23న విజయదశమి రోజున 10.30 గంటలకు పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి. ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజుల్లో అమ్మవారు తొమ్మిది అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. మొదటి రోజైన ఆదివారం.. స్నాపనభిషేకం అనంతరం అమ్మవారి ప్రత్యేక దర్శనాలు ప్రారంభమవుతాయి. ఆరోజున బాలాత్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ దర్శనం ఇవ్వనున్నారు. 16న గాయత్రీ దేవిగా, 17న అన్నపూర్ణ దేవిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. ఇక నవరాత్రుల్లో నాలుగో రోజైన 18వ తేదీన మహాలక్ష్మి దేవిగా, 19న లలితా త్రిపుర సుందరి దేవిగా కొలువుదీరనున్నారు. నవరాత్రుల్లో ఆరో రోజు అక్టోబర్ 20న మూలా నక్షత్రంలో దుర్గమ్మ సరస్వతి దేవిగా, 21న కనకదుర్గ దేవిగా, 22న మహిషాశుర మర్దినిగా, నవరాత్రుల్లో చివరి రోజు 23న రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిస్తారు. అయితే మొదటి రోజు అమ్మవారి స్నాపనభిషేకం అనంతరం ఉదయం 9 గంటల తర్వాత అమ్మవారి దర్శనాలు ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు. రాత్రి 10 గంటల వరకు భక్తులు దుర్గమ్మను దర్శించుకునే వీలుకల్పించామన్నారు. మిగతా రోజుల్లో తెల్లవారు జామున 4 గంటల నుంచే దర్శనాలు ప్రారంభంమవుతాయని చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలా నక్షత్రం రోజైన 20వ తేదీన సరస్వతి అలంకారంలో ఉన్న అమ్మవారిని తెల్లవారు జామున 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శించుకోవచ్చని వెల్లడించారు.


## అకాడ శిక్షణ ప్రారంభం



**టీ మీడియా, అక్టోబర్ 11, గోదావరిఖని :** అకాడ వస్తాద్ గా కంది రాజయ్య వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని ప్రతియేటా దసరాకు అకాడా శిక్షణ ఇస్తున్న కంది నాగరాజు అభినందనీయుడు రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు ప్రశంస,అకాడ వస్తాద్ గా కంది రాజయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ప్రతియేటా దసరాకు అకాడా శిక్షణ ఇస్తున్న కంది నాగరాజు అభినందనీయుడని రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు ప్రశంసించారు.
ఎన్ టి పి సి అన్నపూర్ణ కాలనీ విశ్వభారతి పాఠశాలలో బుధవారం శ్రీ హనుమాన్ అకాడ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు ఎన్వి రమణారెడ్డి,కుమ్మరి శ్రీనివాస్ శారద పాల్గొని అకాడ శిక్షణను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రాచీన యుద్ధ కలలకు జీవం పోస్తూ నేటి తరానికి ఉచితంగా అకాడ శిక్షణ ఇవ్వడం నిజంగా అకాడా పట్ల ఆ కుటుంబానికి ఉన్న బాంధవ్యాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. కీర్తిశేషులు కంది రాజయ్య అకాడ వస్తాద్ కుమారుడు కంది నాగరాజు దసరా ఉత్సవాలలో భాగంగా ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ లో 30 సంవత్సరాలుగా అకాడ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కంది నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కంది చంద్రయ్య, బుర్ర శంకర్ గౌడ్, ఈదునూరి శంకర్, కె.వి చందు,విశ్వ భారతి హై స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్,ప్రిన్సిపల్ ప్రవీణ్, కుమ్మరి శారద విద్యార్థిని,విద్యార్థులు ముత్యాల సాయిరాం, కంది సాగర్,శ్రీకాంత్, కీర్తన్,శ్రీను పాల్గొన్నారు.

## ఎలక్షన్ డేట్‌కే ఎసరు పెట్టిన పెళ్లిళ్లు..

### పోలింగ్ తేదీని మారుస్తు నిర్ణయం



**టీ మీడియా, అక్టోబర్ 11,ఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఐదు రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీని మార్చుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. నవంబర్ 23 బదులు నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే డిసెంబర్ 3న కౌంటింగ్ యథాతథంగా ఉంటుందని స్పష్టంచేసింది. నవంబర్ 23న రాష్ట్రవ్యాప్తంగా చాలా పెళ్లిళ్లు ఉన్నాయని, పోలింగ్ తేదీని మార్చాలని రాజకీయ పార్టీలతో పాటు చాలా మీడియా సంస్థలు ఈసీకి విజ్ఞప్తి చేశాయి. దీంతో ఎన్నికల షెడ్యూల్‌ను మారుస్తునట్టు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఓటింగ్ తేదీలో మార్పు కోసం వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుని.. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తెలిపింది. కొత్త షెడ్యూల్ ప్రకారం 25న (శనివారం) ఓటింగ్ జరుగుతుందని పేర్కొంది. 23న శుభ మూహుర్తం ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పెళ్లిళ్లు ఉన్నాయి. ఆ తేదిన వివాహాలు నిర్వహించేందుకు చాలా కుటుంబాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ క్రమంలో 23న రాజస్థాన్ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో.. దీనిపై చాలా కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. దీంతో రాజస్థాన్ ఎన్నికల తేదీని (నవంబర్ 23) మార్చాలని పాలికి చెందిన భారతీయ జనతా పార్టీ ఎంపీ పీపీ చౌదరి ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాష్ట్రంలో పెళ్లిళ్ల దృష్ట్యా ఓటింగ్ తేదీని మార్చాలంటూ కొన్ని సంఘాలు, సమాజిక సంస్థలు కూడా ఈసీకి ఫిర్యాదు చేశాయి. దీంతో పోలింగ్ తేదీని మారుస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.
కాగా.. రాజస్థాన్‌లో 200 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం వచ్చే ఏడాది జనవరి 14తో ముగుస్తుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర ఎమ్మెల్యేల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ 73 స్థానాలను గెలుచుకుంది. అయితే.. ఈ సారి మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్.. మళ్లీ పట్టు సాధించి అధికారాన్ని దక్కించుకోవాలని బీజేపీ వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి.

### మెదక్ లో...

## హీటెక్కిన రాజకీయం..

### విమర్శలు, ప్రతి విమర్శలతో రచ్చ





**టీ మీడియా, అక్టోబర్ 11,మెదక్, అక్టోబర్ 11:** ఆయనకు ఇంకా కాంగ్రెస్ టికెట్ కన్ఫర్మ్ కాకపోయినప్పటికి.. నియోజకవర్గంలో పర్యటనలు, విమర్శలతో దూకుడు పెంచారు. తన పాత మిత్రులపై విమర్శలకు పదును పెడుతున్నారు. మాటల యుద్ధానికి తెరలేపుతున్నారు. రెండు సార్లు మెదక్ ఎమ్మెల్యేగా గెలిచిన పద్మాదేవేందర్ రెడ్డిపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గంలో పద్మాదేవేందర్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమి లేదని.. తమకు అవకాశం ఇస్తే మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పెడుతామని మైనంపల్లి హన్మంత్ రావు, ఆయన కుమారుడు రోహిత్ రావు పదే పదే తమ ప్రచారంలో చెబుతున్నారు.అయితే మైనంపల్లి హన్మంత్ రావు చేస్తున్న కామెంట్స్ ను చాలా లైట్ తీసు కుంటున్నారట ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి. పదే పదే కామెంట్స్ చేస్తున్న వారి పై మీరు స్పందించాలంటూ అనుచరులు చేస్తున్న ఒత్తిడిని అసలు పట్టించుకోవడం లేదట పద్మాదేవేందర్ రెడ్డి. మెదక్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందంటే తన హయాంలోనే అనే విషయాన్ని పార్టీ శ్రేణులతో అంటున్నట్లుగా సమాచారం.నియోజకవర్గ ప్రజలకు తాను చేసిన అభివృద్ధి తెలుసంటున్నారు ఎమ్మెల్యే.. అయిన మైనంపల్లి ఫ్యామిలీ టికెట్ కూడా కన్ఫర్మ్ అవుతుందో.. లేదో.. కూడా అనుమానం వ్యక్తం చేశారు. అలాంటి వారి గురించి మనం స్పందించడం కూడా నిరూపయోగం అని అన్నట్లుగా తెలుస్తోంది. అయితే ఇటీవలి కాలంలో మైనంపల్లి వర్గం ఎమ్మెల్యే కుటుంబాన్ని టార్గెట్ చేసి.. ఎమ్మెల్యే భర్త అవినీతి పరుడు అంటూ ప్రచారం చేస్తూ ఉంటే.. ఎమ్మెల్యే వర్గం దానికి కౌంటర్లు ఇస్తున్నారట..
ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం..
మైనంపల్లిపై సెటైర్లు విసురుతున్నారు ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అనుచరులు. ఎన్నికలు రాగానే డబ్బు సంచులతో మెదక్ రాజకీయం చేయడానికి వచ్చారని.. ఇక్కడ డబ్బులు పనిచేయవని ప్రజల్లో పలుకుబడి కావాలని రివర్స్ కౌంటర్ వేస్తున్నారు. ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం పెరగడంతో.. ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి తన కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లుగా సమాచారం. మైనంపల్లి అండ్ కో బ్యాచ్ ని పట్టించుకోవద్దని కార్యకర్తలకు సర్దిచెప్పినట్లుగా తెలుస్తోంది. అందరూ బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని.. తొందరపడవద్దు అని హితబోధ చేసినట్లుగా తెలుస్తోంది.ఇలా మెదక్ నియోజకవర్గంలో మైనంపల్లి, పద్మాదేవేందర్ వర్గాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం..వీరు ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికల నాటికి ఇంకా ఎలా ఉంటారో అని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## పోలింగ్ కేంద్రాలని పరిశీలించిన సీఐ



**టీ మీడియా, అక్టోబర్ 11, లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట మండలంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సిఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరతో పాటు,ఓటింగ్ కోసం వచ్చే వృద్ధులకు ర్యాంప్ ఏర్పాటు సౌకర్యాలు పరిశీలించారు.అదే విధంగా పోలింగ్ కేంద్రం గ్రామానికి ఎంత దూరంలో ఉంది ఏదైనా సమస్యలు ఉంటాయా అనే అంశాన్ని పరిశీలించడం జరిగింది.ఉన్నత అధికారుల ఆదేశాల మేరకుఎన్నికలు సజావుగా జరిగే విధంగా అన్ని కేంద్రాల వద్ద ఏర్పాట్లను చేయనున్నట్లు తెలిపారు.

## సిరిపురంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం



**టీ మీడియా, అక్టోబర్ 11, నడిగూడెం :** మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంను హెల్త్ వెల్ నెస్ సెంటర్ ను సూపర్ వైజర్ జి.విజయ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెఫ్ట్ డ్రాప్ అవుట్ ఉన్న 0-5సం. లోపు చిన్నారులను, వివిధ కారణాల వలన వ్యాక్సిన్ వేయించుకొని గర్భిణీ స్త్రీలను గుర్తించి వ్యాక్సిన్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యం.విజయకుమారి, ఆశా వర్కర్లు జి.ధనలక్ష్మి, కె.ఉమా, కె. అరుణమ్మ పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్



**టీమీడియా, అక్టోబర్ 11, లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట లోని ఉత్కూర్ చౌరస్తాలో గల ఇంట్లో ఏడుగురు వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారు అనే నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ ఐ లక్ష్మణ్,సిబ్బంది తో కలసి తనిఖీ చేయగా ఏడుగురు వ్యక్తులు పేకాడుతూ పట్టుబడ్డారని వారి వద్ద నుండి మూడు వేల నాలుగు వందల రూపాయల నగదు పట్టుబడినట్టు ఎస్ ఐ తెలిపారు.

## మంత్రి కేటీఆర్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు



**టీ మీడియా, అక్టోబర్ 11, న్యూఢిల్లీ:** మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి చార్టెడ్ అకౌంటెంట్, కాంగ్రెస్ నేత వేణుగోపాల స్వామి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి డబ్బులు తీసుకోవాల్సిందిగా కేటీఆర్ ప్రజల్ని ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేత లేఖ రాశారు. ఏ పార్టీ నుంచి డబ్బు తీసుకున్నా సరే.. ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయాలని సూచిస్తున్నారని వెల్లడించారు. కేటీఆర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వేణుగోపాల స్వామి వినతి చేశారు. మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోకపోతే తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తానంటూ వేణుగోపాల స్వామి లేఖలో పేర్కొన్నారు.

## దుర్గగుడి ఈఓగా కె.ఎస్.రామారావు బాధ్యతలు



**టీ మీడియా, అక్టోబర్ 11, విజయవాడ:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్దానము ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ సన్నిధిలో నూతన ఈఓగా కె.ఎస్.రామారావు బాధ్యతలు తీసుకున్నారు. ఈరోజు శ్రీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన నూతన ఈఓగా భాధ్యతలు స్వీకరించారు. నూతన ఈఓ కె.ఎస్. రామారావు. గత ఈఓ భ్రమరాంబకి గౌరవ మర్యాదలతో వీడ్కోలు పలికారు. అందరి సమన్వయముతో దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తామన్న ఆయన తెలిపారు.

## యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి దంపతులు



**టీ మీడియా, అక్టోబర్ 11, యాదాద్రి భువనగిరి :** తమ ఇంటి ఇలవేల్పు యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దంపతులు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించినట్లు మంత్రి పేర్కొన్నారు.

## వైసిపి, కేసీఆర్, బిజెపి కలిసి ఆమ్ ఆద్మీని అంతం చేయాలని కుట్ర

### - సిపిఐ నారాయణ



**టీ మీడియా, అక్టోబర్ 11, హైదరాబాద్:** తెలంగాణ సీఎం కేసీఆర్‌పై ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఆత్మస్తుతి పరనిందలా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కేసీఆర్ కుమార్తెను కాపాడేది బిజెపి కాదా?అని ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో రాజీ ఒప్పందం కుదిరిన తర్వాతనే.. వైసిపి, కేసీఆర్, బిజెపి కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయాలని కుట్ర పన్నారని ఆరోపించారు. అందుకే మనీశ్ సిసోదియాను జైల్లో పెట్టారని మండిపడ్డారు. అందరూ కలిసి కుమ్మక్కై సిసోదియాను మాత్రమే ఇరికించారన్నారు. సత్యం రామలింగరాజు మీద సెబీ ఎంక్వైయిరీ వేశారని.. అదానీ కుంభకోణంలో ఎందుకు సెబీ ఎంక్వైయిరీ వేయలేదని ప్రశ్నించారు. పెద్ద కుంభకోణం బయట పెడితే ఆయనను కాపాడుకుంటున్నారని నారాయణ దుయ్యబట్టారు.

## మేడారంలోకిషన్‌రెడ్డి

### -సమక్క సారక్క అమ్మవార్లకు మొక్కులు



**టీ మీడియా, అక్టోబర్ 11,ములుగు:** ప్రధానమంత్రి ములుగుకు గిరిజన యూనివర్సిటీ ఇచ్చినందుకుగానూ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మేడారంలోని సమక్క సారక్క అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..“గిరిజన ఆరాధ్య దేవతలు సమ్మక్క, సారలమ్మ ఆశీస్సులు తెలంగాణకు, దేశ ప్రజలకు ఉండాలని కోరుకుంటున్నాను. ములుగులో గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఇవ్వడం మామూలు విషయం కాదు. అమ్మవార్ల ఆశీస్సులు దేశంలో ఉన్న ప్రజలందరికీ ఉండాలి. ప్రాచీన దేవాలయం రామప్పకు యునెస్కో గుర్తింపు రావడం గొప్ప విషయం. హైదరాబాద్‌లో గిరిజనుల జీవన విధానాలను కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ట్రైబల్ సర్క్యూట్ పేరుతో టూరిజం మినిస్ట్రీ ద్వారా పర్యాటక ప్రాంతాలైన రామప్ప, లక్నవరం, మేడారం, బొగత జలపాతం, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్టీ రిజర్వేషన్ 10% అమలు చేస్తాం” అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రచార వాహనాలకు ఫుల్ డిమాండ్

### -పోటా పోటీ కొనుగోళ్లు



**టీ మీడియా, అక్టోబర్ 11, హైదరాబాద్:** ఎన్నికల తేదీ వచ్చేసింది.. ఊరువాడ, పల్లెపట్టణం తేడా లేకుండా పార్టీల జెండాలు రెపరెపలాడబోతున్నాయి.. మైకుల మోతలతో ప్రచారం ఊపందుకుంటోంది.. ఏ పార్టీ ప్రచారమైనా మస్ట్ గా ఉండేటివి ప్రచార వాహనాలే.. అధికార పార్టీ..ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా ప్రతి పార్టీ ఎన్నికల ప్రచారాలతో గెలుపు బాట పట్టేందుకు సిద్ధం అవుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తిరగనున్న ప్రచార రథాలకు డిమాండ్ పెరిగింది. ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల నేతలు ప్రచారం షురూ చేసారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎక్కడ చూసిన ప్రచార వాహనాలు రేడి అవుతున్నాయి..దీంతో సిటీ లోని కార్పెంటర్స్, ఫ్లెక్సీ డిజైనర్స్, ఆర్టిస్ట్ లు ప్రచారపు వాహనాల తయారీలో బిజీ అయ్యారు..అసెంబ్లీ ఎన్నికలు కావడంతో లోకల్ పార్టీ నుండి సెంట్రల్ పార్టీ దాకా ప్రతి ఒకరు తమ స్థాయి లో జోరుగా ఎన్నికల ప్రచారం చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.. ఇప్పటికే సిటిలోని అనేక చోట్ల చాలమంది కార్మికులు ప్రచార వాహనాలను రెడీ చేసే బిజీలో పడ్డారు..దాదాపు ఒక వాహనాన్ని రెడీ చేయడానికి ఐదు ఆరు గంటల సమయం పడుతుందని అంటున్నారు కార్పేంటర్స్.. ఓటర్లు అట్రాక్ట్ అయ్యే విధంగా పార్టీ రంగులు..పథకాలు..నాయకుల పేర్లతో ప్రచార రథాలు సిద్ధం చేస్తున్నట్టుగా చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఈ ప్రచార వాహనాలను సిద్ధం చేస్తున్నారు..ఇలా రెడీ అయినా వాహనాలకు మంచి డెకరేషన్ చేసి మైక్ సెట్ ను ఫిక్స్ చేసి ఫ్లెక్సీలను కడుతారు. ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో డిజిటల్ ఫ్లెక్సీలకు మార్కేట్లో డిమాండ్ ఉండటంతో డిజిటల్ బ్యానర్లు.. ఫ్లెక్సిలను ప్రచార రథాలకు అమరుస్తున్నారు. కొన్ని పార్టీల అభ్యర్థులు ఖరారు కాగా మరికొన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించపోయినప్పటికీ.. ఎవరికి వారు తామే అభ్యర్థులమంటూ కొందరు నేతలు ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు.. ఏది ఏమైనా ఎలక్షన్ పుణ్యమా అని రెండు చేతులా పనిదొరికిందంటున్నారు కార్మికులు.ఈ బండ్ల పైన ఎలక్షన్ తేదీ ని తమ పార్టీ గుర్తు ను హైలెట్ చేస్తారు..ఎక్కువగా డీసీఎం , గూడ్స్ ఆటోలోనే ప్రచారం చేస్తారని.. ఒక్కో అభ్యర్థి నాలుగు నుండి ఐదు ప్రచార రథాలను తయారు చేయించుకుంటన్నారంటున్నారు ప్రచార రథాల తయారీ దారులు..క్యాండిట్లకు స్పేషల్ గా వారి పార్టీ అమలు చేసిన సంక్షేమపథకాలు..అధికారంలోకి వస్తే కొత్తగా అమలు చేసే పథకాలను వాహనాలపై కనిపించేల ఒక వాహనం.. కళకారులు ఆట పాటలకు మరో వాహనం సిద్ధం చేస్తునామంటున్నారు ఇలా ఒకే సారి బల్క్ గా అర్డర్స్ వస్తునాయంటున్నారు వాహనాల తయారీ దారులు. ప్రచార వాహనాలతో పాట ఫ్లెక్సీలకు..కండువాలకు..జేండు..టోపిల పార్టీ వస్త్రాలకు ఫుల్ డిమాండ్ మార్కట్లో కనిపిస్తుంది..హైదరాబాద్ నుండి అన్ని జిల్లాలకు వాహనాలను రేడీ చేసి పంపిస్తున్నారు పార్టీల నేతలు.

## సోషల్ మీడియాపై.. ఫోకస్ పెట్టిన కమిషన్

### -ప్రత్యేక వింగ్ ఏర్పాటు
### -22 ఏజెన్సీలతో ప్రత్యేక నిఘా
### -హద్దుమీరితే కఠిన చర్యలు

**టీ మీడియా, అక్టోబర్ 11, హైదరాబాద్:** తెలంగాణ లో ఎన్నికల నగారా మోగింది. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుంది రాష్ట్ర ఎన్నికల కమిషన్. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికలకు ఇంకా 50 రోజులు సమయం ఉండడంతో పొలిటికల్ పార్టీలన్నీ అభ్యర్థుల ప్రకటన, ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించాయి. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు అభ్యర్థుల ప్రచారంతో పాటు వారి కదలికలపై కన్నేశారు. 22 ఏజెన్సీలతో సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టింది ఎన్నికల కమిషన్. అలాగే రాజకీయ, ఇతర సోషల్ మీడియా వెబ్‌సైట్లపైనా ప్రత్యేక దృష్టి సారించింది. వీడియో క్లిప్పులు, సోషల్ మీడియాలో పార్టీల ప్రచారంపై నజర్ వేసింది. ఎన్నికల కోడ్ ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది ఈసీ.ఎన్నికల సమయంలో అభ్యర్థుల కదలిక, అక్రమ మద్యం, నగదు లావాదేవీలు, డబ్బు తరలింపు, హవాలా మనీపై ఫోకస్ పెట్టింది ఈసీ. ముఖ్యంగా అలాగే అభ్యర్థుల ప్రచార సరళిపై దృష్టి సారించింది. ప్రత్యేకంగా సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్‌ల పై నిఘా పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక వింగ్ ఏర్పాటుకు సిద్ధం అవుతుంది తెలంగాణ ఈసీ. అన్ని పార్టీల సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు, నాయకుల సపరేట్ సోషల్ మీడియా ఖాతాలు, వారి పోస్టులు, కామెంట్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంది. దీని కోసం స్పెషల్ టీమ్‌ను సైతం సిద్ధం చేసింది ఎన్నికల కమిషన్.ముఖ్యంగా గూగుల్,ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించేలా, ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను ప్రలోభపెట్టేలా, ఇతర వర్గాలను కించపర్చేలా చేసే పోస్టింగ్‌లపై వివిధ వెబ్‌సైట్ల ద్వారా పర్యవేక్షించడానికి రెఢీ అయింది. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవంటోంది ఈసీ. దీంతో పాటు తప్పుడు సమాచారం, ఎన్నికల ప్రచారం




వంటి బల్క్ %హామీ%లు చేసినా, రూమర్లను ప్రచారం చేసినా డేగ కన్నుతో వాచ్ చేస్తోంది ఈసీ.ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచారాలు, ప్రలోభాలకు గురి చేసేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నది ఎన్నికల కమిషన్. అయితే టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. బహిరంగ ప్రచారంతో పాటు సోషల్ మీడియా ప్రచారాలు బాగా పెరిగాయి. ఎక్కువగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్న సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌పై ఈ సారి ప్రత్యేకంగా దృష్టి పెట్టామంటున్నారు ఎన్నికల సంఘం అధికారులు.ఇదిలావుంటే ఇకపై ప్రజాప్రతినిధులు, మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే తాట తీస్తామంటున్నారు తెలంగాణ పోలీసులు. అసభ్యకరమైన పోస్టులు చేసినా, ఫొటో మార్ఫ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు హైదరాబాద్ క్రైమ్ డీసీపీ స్నేహ మెహ్రా. ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులపై ట్రోలింగ్ చేసిన 20 మందిపై కేసులు నమోదు చేసి, 8 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

## తమిళనాడులో ‘ప్రయివేటు’ ఇస్రో

### -రెండో స్పేస్‌పోర్ట్‌కు భూసేకరణ పూర్తి
### -రెండు వేల ఎకరాలు కేటాయింపు



**టీ మీడియా, అక్టోబర్ 11,బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రెండో స్పేస్‌పోర్ట్ (అంతరిక్ష పరిశోధన కేంద్రం)ను తమిళనాడులో ఏర్పాటు చేయనున్నారు. తూత్తుకుడి జిల్లాలోని కులశేఖరపట్టణంలో నిర్మించే ఈ స్పేస్‌పోర్ట్ సుమారు రెండేళ్లలో అందుబాటులోకి రానుంది. ప్రయివేటు రంగ శాటిలైట్లను నింగిలోకి తీసుకెళ్లేందుకు మాత్రమే ఈ కేంద్రాన్ని వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీహరి కోటలో ఉన్న సతీశ్ దావన్ భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) నుంచి ఇస్రో స్వీయ వ్యోమ నౌకలను పంపడంతో పాటు ప్రయివేటు వ్యోమనౌకలను, కృత్రిమ ఉపగ్రహాలను పంపిస్తున్నారు. ఇక నుంచి ప్రయివేటు రంగానికి సంబంధించిన వ్యోమనౌకలను, ఉపగ్రహాలను కులశేఖరపట్టణంలో నిర్మించే స్పేస్‌పోర్టు నుంచి పంపించనున్నారు. ఇందుకోసం అవసరమైన రెండు వేల ఎకరాల భూమిని ప్రభుత్వం ఇస్రోకు అప్పగించినట్లు సంబంధిత అధికారులు మంగళవారం తెలిపారు. అయితే ఇక్కడ నిర్మించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్స్ (ఎస్-ఎస్ఎల్వి)ను ప్రైవేట్ రంగం మాత్రమే వినియోగిస్తుంది. ఈ వివరాలను బెంగళూరులో మంగళవారం ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఐఎన్-స్పేస్) చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా వెల్లడించారు. ‘మేం తూత్తుకుడి జిల్లాలో పూర్తి ప్రయోగ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఇది ఎస్ఎస్ఎల్వి ప్రయోగాల కోసం అంకితం చేయనున్నాం. సుమారు 2 వేల ఎకరాలను సేకరించి ఇస్రోకు అప్పగించారు. బడ్జెట్, ప్లానింగ్ వివరాలు చర్చిస్తున్నాం. ఇప్పటి నుంచి రెండు సంవత్సరాల్లో అందుబాటులోకి రానుంది’ అని తెలిపారు. అలాగే, ఈ లాంచ్ ప్యాడ్‌ను ప్రైవేట్ రంగం మాత్రమే ఉపయోగిస్తుందని గోయెంకా తెలిపారు. ఇక్కడ నుంచి ఇస్రో రాకెట్లు ప్రయోగించబోరని తెలిపారు. ఈ స్పేస్‌పోర్ట్‌కు సమీపంలో ఒక స్మాల్ స్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ కూడా రానుందని తెలిపారు. ప్రస్తుతానికి ఇస్రోకు శ్రీహరికోటలో ఒక స్పేస్‌పోర్ట్ ఉన్న సంగతి తెలిసిందే.

## 70 మందితో మొదటి లిస్ట్ ఫైనల్ చేశాం

### -భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి



**టీ మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతలు ఎంత ఏడ్చినా నల్లగొండలో గెలిచేది నేనేనని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు నల్లగొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “ఇప్పటికే 70 మంది ఉన్నా సింగిల్ పేర్ల జాబితాను ఫైనల్ చేశాం. తదుపరి డబుల్ పేర్లు ఉన్న లిస్ట్‌లో పేర్లు పరిశీలించక లిస్ట్‌ను ఫైనల్ చేస్తాం. వీలైతే మొత్తం లిస్ట్ ఒకేసారి విడుదల చేస్తాం. కుదరకపోతే దసరా ముందే 16 తేదీ లోపు 70 మందితో మొదటి లిస్ట్ ప్రకటిస్తాం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటే. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడానికే కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కుటుంబ పార్టీ. కాంగ్రెస్ పార్టీలో కులాల వారీగా అందరికీ న్యాయం చేస్తాం. ధరణితో ఒక్కో ఎమ్మెల్యే వెయ్యి కోట్లకు అవినీతికి పాల్పడ్డారు. పది గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదు. 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి కేటీఆర్ నువ్వు కూడా 24 గంటలు తీగలు పట్టుకో%రా%. ఆరు గంటలు ఇస్తే నువ్వు కూడా బతుకుతావు. అన్ని సర్వేల్లో కాంగ్రెస్ పార్టీకి 65- 75 సీట్లు వస్తాయని పలు సర్వేలు చెబుతున్నాయి. నల్లగొండలో బీఆర్ఎస్ నేతలకు జండూబామ్ ఎప్పుడో ఒకసారే పనిచేస్తాది. బీఆర్ఎస్ నేతలు జండూబామ్‌తో ఏడ్చి.. ప్రజలను ఏడిపించేలా చేశారు. ఎంత ఏడ్చినా ఏం చేసినా 40 రోజుల్లో దుకాణం బంద్ అవుతాది” అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సెటైర్లు వేశారు.

## బీఆర్ఎస్ కు ఓటెయ్యం..

### -దళిత బంధు ఎంపికపైల అందోళన
### -,ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన




**టీ మీడియా, అక్టోబర్ 11,బెజ్జంకి :** దళిత బంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో అధికారులు గుట్టుచప్పుడుకాకుండా కొందరిని ఎంపిక చేసి అన్యాయం చేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటెయ్యమని చీలాపూర్ దళిత సామాజిక ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం చీలాపూర్ గ్రామ పంచాయతీ,మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం అవరణం వద్ద దళిత బంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో అధికారులు,అధికార పార్టీల నాయకులు గుట్టచప్పుడుకాకుండా వ్యవహరించిన తీరుపై దళిత సామాజిక ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.గ్రామ సర్పంచ్ రాగుల మొండయ్యను దళిత బంధు పథకం లబ్ధిదారుల ఎంపికపై వివరణ కోరడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాకుండా దాటవేసే దోరణి అవలంభిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.దళిత బంధు పథకంలో అత్యధికంగా అన్యాయానికి గురవుతున్నది ఎక్కువ మంది నీరుపేద దళిత సామాజిక వర్గాల ప్రజలేనని రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## న్యూస్‌క్లిక్ ఫౌండర్ ఇల్లు, ఆఫీసులో సీబీఐ సోదాలు




**టీ మీడియా, అక్టోబర్ 11,ఢిల్లీ :** చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఢిల్లీ పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ నివాసం, కార్యాలయంలో సీబీఐ బుధవారం సోదాలు చేపట్టింది. ఈ ఉదయం ప్రబీర్ నివాసానికి, కార్యాలయానికి చేరుకున్న సీబీఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఎఫ్‌సిఆర్ఏ నిబంధనలను ఉల్లంఘించి పోర్టల్‌కు విదేశీ నిధులు అందాయని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ఆ సంస్థపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధకచట్టం కేసులో పాటియాలా హౌస్ కోర్టు పుర్కాయస్థ మరియు హెచ్.ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిలను 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపిన ఒకరోజు తరువాత ఈ చర్యలకు పాల్పడింది.

## గొంతుకోసి మహిళ హత్య



**టీ మీడియా, అక్టోబర్ 11, పెద్దపల్లి :** జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మంథని పట్టణం ఎరుకల గూడెంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. గుర్తు తెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి మహిళ గొంతు కోసి హతమార్చారు. మృతురాలు మంథని మండలం గుమ్మునూరు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ రేషన్ డీలర్ బందెల రాజమణిగా గుర్తించారు. సమాచారం అందుకున్నర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రాజమణికి నలుగురు పిల్లలు ఉన్నారు. భర్త చనిపోవడంతో సంతోష్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నది. భార్య పిల్లలు వున్న సంతోష్ రాజమణిని హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సింగరేణి ఎన్నికలు వాయిదా హైకోర్టు ఆదేశాలు

**టీ మీడియా, అక్టోబర్ 11, హైదరాబాద్:** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఈ మేరకు బుధవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సింగరేణి అభ్యర్థణ మేరకు డిసెంబర్ 27న ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి ఎలక్షన్స్‌ను వాయిదావేయడానికి అంగీకరించింది. నవంబర్ 30వ తేదీలోపు ఎన్నికల తుది జాబితాను రూపొందించి కార్మిక శాఖకు సమర్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు రేపటిలోగా హామీ పత్రం సమర్పించాలని స్పష్టం చేసింది. అక్టోబర్‌లోగా గుర్తింపు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలన్న సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సింగరేణి యాజమాన్యం అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కాగా, అక్టోబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని సింగిల్ జడ్డి ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరడం లేదని, ఆ గడువును పొడిగించాలని మాత్రమే కోరుతున్నామని యాజమాన్యం తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా శాసనసభ ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారని, ఈ పరిస్థితుల్లో అక్టోబర్ నాటికి ఎన్నికలను నిర్వహించడం కష్టమని వివరించారు.